
సాక్షి పల్నాడు

శనివారం ၊ 8 ၊ జూన్ ၊ 2024



శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

నకరికల్లు: స్థానిక శ్రీలక్ష్మీ నర్సింహస్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా శుక్రవారం 16 రోజుల పండుగ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 504.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5,000, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,000 వరకు పలికింది.



న్యూస్‌రీల్

ఇన్‌చార్జి ఏజీపీ పదవికి కట్టా నారపరెడ్డి రాజీనామా

నరసరావుపేట: జిల్లా కోర్టు ఇన్‌చార్జి ఏజీపీగా పనిచేస్తున్న కట్టా నారపరెడ్డి తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు తన రాజీనామా పత్రాన్ని పంపించారు. తన వద్దనున్న రికార్డులను స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.

కారుచోలలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి... పలువురిపై కేసు నమోదు

యడ్లపాడు: వైఎస్సార్ సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తల దాడి నేపథ్యంలో శుక్రవారం మండలంలోని కారుచోల గ్రామంలో పోలీసులు రెండోరోజు పికెట్‌ను కొనసాగించారు. గురువారం ఉదయం గ్రామంలోని లూథరన్ చర్చి భూముల వేలం డబ్బుల విషయం చర్చించిన అనంతరం వైఎస్సార్ సీపీకి చెందిన తలతోటి పౌలు, మద్దూరి దావీదులపై రాళ్లు, కర్రలతో దాడి చేసిన విషయం విదితమే. దాడిలో గాయపడిన దావీదు చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్చ్ కాగా, తీవ్రగాయాలైన పౌలుకు గుంటూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో తలకు ఆపరేషన్ చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ దాడి చేసిన నాగభూషణం, యోహానుబాబు, ఏసోబు, పున్నారావు, సూరి, మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా రెండోరోజైన శుక్రవారం పికెట్‌ను కొనసాగించామన్నారు. ఈ పికెట్‌లో రూరల్ ఎస్ఐ బాలకృష్ణ, నలుగురు కానిస్టేబుళ్లు ఉన్నట్లు వెల్లడించారు.

ఈ-పోస్ట్‌తో విజేతలకు అభినందనలు

తపాలశాఖ డివిజన్ సూపరింటెండెంట్ కరుణాకరబాబు

తెనాలి: 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజేతలను అభినందించేందుకు తపాలశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తపాలశాఖ తెనాలి డివిజన్ సూపరింటెండెంట్ జి.కరుణాకరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ప్రజలు తమకు దగ్గర్లోని పోస్టాఫీసులో రూ.10, రూ.2 జీఎస్టీ కలిపి రూ.12 రుసుం చెల్లించి ఈ-పోస్ట్ ద్వారా తమ ప్రియతమ నేతకు శుభాకాంక్షలు పంపవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం, పీఎం వరకు ఎవరికైనా శుభాకాంక్షల సందేశం పంపవచ్చని, ఆయా సందేశాలు నేరుగా సంబంధిత నాయకులకు చేరుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పలు రైళ్లు దారి మళ్లింపు

లక్ష్మీపురం(గుంటూరుపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఇంజినీరింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను దారి మళ్లించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా ప్రయాణించాల్సిన భాగ్యనగర్-కాకినాడ పోర్ట్(12756) రైలును ఈనెల 8, 15, 22, 29 తేదీల్లో గుడివాడ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా ప్రయాణించాల్సిన లింగంపల్లి-విశాఖపట్నం(12806) రైలు ఈనెల 8, 9, 11, 12, 15, 16, 18, 19, 22, 23, 25, 26, 29, 30 తేదీల్లో గుడివాడ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

యువకుడిపై దాడి

చికిత్స పొందుతూ మృతి

కాకుమాను: స్నేహితుల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో గురువారం రాత్రి జరిగిన దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు... పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన ముళ్లమూరి హరి ప్రసాద్(నాని), అదే గ్రామానికి చెందిన దినేష్ స్నేహితులు. దినేష్ కారణంగా హరిప్రసాద్ కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయి. ఈ విషయమై ఇరువురి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగింది. దినేష్, హరిప్రసాద్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన హరిప్రసాద్‌ను తల్లిదండ్రులు, కాలనీ వాసులు గుంటూరులోని ప్రజా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దినేష్, మృతుడి అక్కడ భర్త, మేనమామ కలసి హత్య చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.


ఓటర్ల నోటా పాట

- కొందరు అభ్యర్థులకు పోలైన ఓట్ల కన్నా 'నోటా'యే అధికం
- జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 9,492 నోటా ఓట్లు
- నరసరావుపేట లోక్‌సభలో నోటాకు 11,199 ఓట్లు

సత్తెనపల్లి: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నచ్చకుంటే తిరస్కరణ ఓటు వేసే హక్కును భారత రాజ్యాంగం ఎప్పుడో కల్పించింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంఘం నోటాను అమలు చేసింది. బరిలో నిలిచిన అభ్యర్థుల్లో కొందరి కంటే నోటాకే ఓట్లు ఎక్కువగా పడ్డాయి.

➡ 2024 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 9,492 ఓట్లు నోటాకు పోలయ్యాయి. అత్యధికంగా గురజాల నియోజకవర్గంలో 1,888 ఓట్లు నోటాకు పడితే అత్యల్పంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో 788 ఓట్లు నోటాకు పోలయ్యాయి. నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గంలో 11,199 ఓట్లు నోటాకు పోలయ్యాయి.

➡ 2014 ఎన్నికల నుంచి నోటాకు ఆదరణ



పెరుగుతూ వస్తోంది. బరిలో ఉన్న అభ్యర్థులు ఎవరు నచ్చకపోతే ఓటర్లు నోటా బటన్ నొక్కేస్తున్నారు. 2014లో తొలిసారిగా నోటాను బ్యాలెట్ షీట్‌లో చేర్చారు. ఈ ఎన్నికల్లో పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నోటాకు 4,295 ఓట్లు పోలయ్యాయి. అత్యధికంగా మాచర్ల నియోజకవర్గంలో 915 ఓట్లు నోటాకు పడితే అత్యల్పంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో 438 ఓట్లు నోటాకు పోలయ్యాయి.

➡ 2019లో పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 10,475 ఓట్లు నోటాకు పోలయ్యాయి. అత్యధికంగా గురజాల నియోజకవర్గంలో 2,062 ఓట్లు నోటాకు పడితే అత్యల్పంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో 897 ఓట్లు నోటాకు పోలయ్యాయి.

జిల్లాలో వరుసగా మూడు అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్లు..

నియోజకవర్గం	2014	2019	2024
పెదకూరపాడు	600	1,397	1,184
చిలకలూరిపేట	438	897	788
నరసరావుపేట	613	1,019	1,052
సత్తెనపల్లి	594	1,244	1,140
వినుకొండ	656	1,942	1,694
గురజాల	479	2,062	1,888
మాచర్ల	915	1,914	1,746
మొత్తం	4,295	10,475	9,492

అనుమానంతో భార్యను హత్యచేసిన భర్త

కత్తితో మెడపై నరికి చంపిన వైనం

చినగంజాం: భార్యను అనుమానించిన ఓ భర్త.. ఆమెను కత్తితో మెడపై నరికి చంపిన సంఘటన బాపట్ల జిల్లా చినగంజాం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చినగంజాం పంచాయతీ మహాలక్ష్మీకాలనీకి చెందిన కత్తి దుర్గ (30)ను భర్త కత్తి శ్రీను దారుణంగా కత్తితో దాడి చేసి మెడపై నరికి చంపాడు. వీరికి 15 సంవత్సరాల కిందట వివాహమైంది. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా మహాలక్ష్మీకాలనీలో కాపురం ఉంటున్నారు. భార్య దుర్గ కొద్ది రోజులుగా తరచూ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతుందనే అనుమానంతో గొడవలు జరుగుతున్నాయి. భర్త వేధింపులు తట్టుకోలేని భార్య దుర్గ.. అదే కాలనీలో నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల వద్దకు నెల రోజుల కిందట తన తొమ్మిదేళ్ల రెండో కుమార్తెను వెంట తీసుకుని వెళ్లిపోయింది. ఈ క్రమంలో శుక్రవారం భర్త కత్తి శ్రీను తన అత్తమామలు ఇంట్లో లేనివేళ వెళ్లి భార్యతో గొడవపడ్డాడు. ఇద్దరూ వాదులాడుకుంటుండగా, ముందుగా వేసు



సంఘటన స్థలంలో దుర్గ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

కున్న ప్లాన్ ప్రకారం కత్తితో ఆమె మెడపై నరికి దారుణంగా హత్య చేశాడు. ఆమె అక్కడికక్కడే చనిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న కుమార్తె పరిగెత్తుకుంటూ బయటకు వెళ్లి స్థానికులకు సమాచారం అందించింది. సంఘటన స్థలానికి వెళ్లిన స్థానికులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు చేరుకునే సరికే దుర్గ మృతి చెంది ఉంది. ఆమె భర్త శ్రీను పరారీలో ఉన్నాడు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ, ఎస్ఐ...

సంఘటన స్థలాన్ని ఇంకొల్లు సీఐ బీ శ్రీనివాసరావు, చినగంజాం ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు పరిశీలించి శవ పంచనామా నిర్వహించారు. దుర్గ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడు కత్తి శ్రీనును పట్టుకుంటామని చెప్పారు.

మేం ఇంట్లో లేని సమయంలో మా కుమార్తెను చంపాడు...

తాము ఇంట్లో లేకుండా వేటకు వెళ్లిన సమయంలో వచ్చిన తమ అల్లుడు శ్రీను తమ కుమార్తె దుర్గను కత్తితో దారుణంగా నరికి చంపాడని దుర్గ తల్లిదండ్రులు ఎం.అంజయ్య, రాగమ్మ పోలీసులకు తెలిపారు. పెళ్లయిన దగ్గర నుంచి తమ కుమార్తెను తరచూ వేధింపులకు గురిచేసేవాడని చెప్పారు. ఆమెకు ముగ్గురు బిడ్డలున్నారని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను వారు కోరారు.

డీఎస్ఏ స్టేడియం ప్రవేశ ద్వారానికి టీడీపీ రంగులు



సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియం ప్రవేశ ద్వారానికి టీడీపీ రంగులు వేస్తున్న దృశ్యం



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వేసిన శిలాఫలకం ధ్వంసం చేసిన దృశ్యం

హైకోర్టు ఉత్తర్వులు ఖాతరు చేయని టీడీపీ శ్రేణులు

నరసరావుపేట: ప్రభుత్వ భవనాలు, ఆస్తులకు పార్టీ రంగులు వేయవద్దంటూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను లెక్కచేయకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సత్తెనపల్లిరోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణం (డీఎస్ఏ స్టేడియం) ప్రవేశ ద్వారం పైనున్న పేరును చెరిపివేసి ఉన్న రంగులను తొలగించి పసుపు రంగు వేస్తున్నారు. దీంతోపాటు గత ఐదేళ్ల కాలంలో స్టేడియంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేరుపై ఉన్న శిలాఫలకాన్ని పగులకొట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయ భవనాలకు పార్టీ రంగులు పోలిన వాటిని వేసినందుకు టీడీపీ శ్రేణులు హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు సచివాలయాలు, ఇతర భవనాలకు వేసిన రంగులను తొలగించారు. ఇప్పుడు తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఆస్తులపై పార్టీ రంగులు వేయటాన్ని నీతులు చెప్పేటానికేగాని ఆచరించేందుకు కాదనన్నట్లు ఉందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ బీఎస్ఏ స్వీ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ విద్యార్హతలు గల అభ్యర్థులకు ఫిట్టర్ హెల్పర్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్, ఆటోమొబైల్ వాషర్ కోర్సుల్లో ఈనెల 15 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంస్థ కార్యాలయంలో నేరుగాను, 80746 07278, 83339, 73929 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రమాణ స్వీకార మహోత్సవానికి స్థల పరిశీలన

కేసరపల్లి ఐటీ పార్కు వద్ద ఏర్పాట్లు

తాడేపల్లిరూరల్: నూతనంగా ఏర్పడిన ఎన్‌డీఏ కూటమి ప్రమాణ స్వీకారం చేసేందుకు అధికారులతోపాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు స్థలాల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ, టీడీపీ జనసేన లకు చెందిన నాయకుల స్థలాల్లో ఈ ఏర్పాట్లను చేయాలని ముందుగా ఆలోచించారు. ప్రమాణ స్వీకారం చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించేందుకు గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు, స్థానిక టీడీపీ నాయకులు విచ్చేశారు. ఇప్పటికే అధికార యంత్రాంగం ముళ్ల



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు

పొదల మధ్య ఉన్న ఆ స్థలాన్ని బాగుచేసేందుకు భారీ యంత్రాలను బ్రహ్మానందపురం ప్రభుత్వ పాఠశాల వద్ద పా ర్కింగ్ చేశారు. ఇదిలా ఉండగా గన్నవరం ఎయిర్ పోర్టు కేసరపల్లి ఐటీ పార్కు వద్ద ప్రమాణ స్వీకారానికి స్థల పరిశీలన చేసి ఖరారు చేశారు.

అవాస్తవాలు ప్రసారం చేస్తే చట్టపరమైన చర్యలు

- సోషల్ మీడియా నిబద్ధతతో వ్యవహరించాలి
- చీరాల డీఎస్పీ మురళీకృష్ణ

మార్టూరు: ప్రజాస్వామ్య వ్యవస్థలో సోషల్ మీడియాకు అత్యంత ప్రాధాన్యం ఉందని దానిని వక్రీకరించడం మంచి పద్ధతి కాదని.. వాస్తవాలు తెలుసుకోకుండా అవాస్తవాలను ప్రసారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రాత్రి సీఐ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్టూరు తండాకు చెందిన ముడావత్ బాలాజీ నాయక్ అలియాస్ బాల నాయక్ (53) ఈనెల 5వ తేదీ రాత్రి ఇంటి నుంచి బజారుకు వెళ్లి ఆరో తేదీ ఉదయం కూరగాయలు మార్కెట్ సమీపంలో శవమై కనిపించాడు. ఈవిషయాన్ని కొన్ని సోషల్ మీడియా సంస్థలు హత్యగా వక్రీకరించి అవాస్తవాలను ప్రచారం చేయటాన్ని ఆయన ఖండించారు. బాలాజీ నాయక్ మద్యం మత్తులో ఐదో తేదీ రాత్రి ఇంటికి నడిచి వెళ్లే క్రమంలో డ్రైనేజీ కాలువ పక్కన జారిపడి అనంతరం మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక పూర్తి వాస్తవాలు వెలుగు చూస్తాయనే ఉద్దేశంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసు విషయంలో సీఐతో పాటు ఇతర అధికారులు నిబద్ధత, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నారన్నారు. కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేయడం ద్వారా ప్రజలలో తప్పుడు సంకేతాలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. మీడియా ప్రజలకు పోలీసులకు మధ్య సంధానకర్తగా ఉండాలే కానీ సమస్యను మరింత జటిలం చేసేదిగా వ్యవహరించకూడదని ఆయన హితవు పలికారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియా వేదికగా అవాస్తవాలను ప్రసారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ, ఏఎస్ఐలు మహబూబ్ బాషా సైదా తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

వేసవి సెలవుల ముగింపు నేపథ్యంలో...

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ కనిపించింది. శుక్రవారం కావడంతో పాటు మరి కొద్ది రోజుల్లో వేసవి సెలవులు ముగియనుండటంతో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు కొనసాగింది. ఉదయం ఎండ తీవ్రత, ఉక్కపోతతో కొండపైకి చేరుకున్న భక్తులు మధ్యాహ్నం 1 గంట తర్వాత వాతావరణం కాస్త చల్లబడటంతో ఆలయ ప్రాంగణంలోనే భక్తులు సేద తీరారు. మధ్యాహ్నం ఒంటిగంటకు సన్నటి చిరు జల్లులు కురవడంతో భక్తులు మహా మండపం 7వ అంతస్తులోని కళావేదిక వద్ద సేద తీరి కనిపించారు. రద్దీ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వెళ్లే క్యూలైన్లలో భక్తులు బారులు తీరి కనిపించారు. మహా మండపం లిఫ్టుపై వచ్చే భక్తులను 5వ అంతస్తు వరకు అనుమతించి అక్కడి నుంచి క్యూలైన్ మార్గంలో ఆలయానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. మరో వైపున ఘాట్ రోడ్డుపై కొండపైకి చేరుకున్న భక్తుల క్యూ ఓం టర్నింగ్‌లోకి టికెట్ల కౌంటర్ వరకు చేరింది. రద్దీ నేపథ్యంలో అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లను పర్యవేక్షిస్తూ, రద్దీకి అనుగుణంగా సర్వదర్శనంలో వేచి ఉన్న వారిని రూ.100 క్యూలైన్‌లోకి అధికారులు అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి మహా నివేదన నిమిత్తం అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో క్యూలైన్‌లో భక్తుల తాకిడి మరింత పెరిగింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలోనూ పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని తరలించారు. అమ్మవారిని పలువురు ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు.



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ పదవికి రాము రాజీనామా

కొరిటెపాడు(గుంటూరువెస్ట్): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. సీతారామాంజనేయులు 2019 డిసెంబరు 4న చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మొత్తం నాలుగు సంవత్సరాల ఆరు నెలలపాటు పదవిలో కొనసాగారు. మొదట రూ.2వేల కోట్ల టర్నోవర్‌లో ఉన్న బ్యాంక్‌ను రూ.6 వేల కోట్లకు తీసుకువచ్చారు. సుమారు 2 లక్షల కొత్త అకౌంట్లు బ్యాంకుకు వచ్చాయి.
డిపాజిట్లు కూడా పెద్ద మొత్తంలో పెరిగాయి. ఫలితంగా బ్యాంకును సీతారామాంజనేయులు లాభాల బాటలో నడిపించారనడంలో అతిశయోక్తి లేదు. బ్యాంకు చైర్మన్‌గా పని చేయడం తనకు సంతృప్తినిచ్చిందని రాము విలేకరులకు తెలిపారు. తనకు సహకరించిన పాలకమండలి సభ్యులు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది, ఖాతాదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం రాత్రి బ్రాడీపేటలోని జీడీసీసీ బ్యాంకు ఆవరణలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, బ్యాంక్ చైర్మన్, పాలకవర్గ సభ్యులను సత్కరించారు. బ్యాంకు అభివృద్ధికి పాటుపడాలని ఉద్యోగులకు రాము సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాతంశెట్టి సీతారామాంజనేయులు

మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు

గుంటూరుమెడికల్: మలేరియా నివారణ మాసోత్సవంలో భాగంగా శుక్రవారం గుంటూరు నగరంలో ఎల్బీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమల వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. దోమల నివారణ చర్యలైన, ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలని సూచించారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పరిసరాలలో ఉన్న టీ కప్పులు, రోళ్లు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, సాయంత్రం వేపాకు పొగ వేయుట, పూర్తిగా కప్పి ఉంచు వస్త్రాలను ధరించుట, సాయంత్రం తలుపులు, కిటికీలు మూసివేయుట, దోమతెరలు తప్పనిసరిగా వాడుట వంటి చర్యల వల్ల దోమలను పూర్తిగా నివారించుకోవచ్చన్నారు. మలేరియా నివారణ మాసోత్సవంపై ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి బయలుదేరి మణి హోటల్ సెంటర్ మీదుగా పాత గుంటూరు వీధుల్లో కొనసాగుతూ ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. ర్యాలీలో ఎన్సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.వి.సుబ్బరాజు, వైద్యాధికారి డాక్టర్ ఎం.డి నూర్‌బాషా, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, ప్రభాకర్‌రెడ్డి, నరేంద్ర, సబ్ యూనిట్ ఆఫీసర్, సుధా, శివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి, మలేరియా సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు 42 గ్రాముల బంగారుహారం

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మవారికి 42 గ్రాముల బంగారు హారం సమర్పించారు. నందిగామ మండలం ఐతవరం గ్రామానికి చెందిన చుండు రాంబాబు, వెంకాయమ్మ దంపతులు శుక్రవారం రూ.3 లక్షల విలువ చేసే ముత్యాలతో కూడిన 42 గ్రాముల బంగారు పులిగోరు హారాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.



శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడొద్దు

- చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు
- గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



నగరంపాలెం: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడవద్దని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శుక్రవారం ఆదేశించారు. ప్రధాన ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పహారా ఉండాలన్నారు. గ్రామాల్లోని పోలీస్ పికెట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం అందించాలని తెలిపారు.

క్లుప్తంగా

విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నరసరావుపేట: ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మస్తానమ్మ హెచ్చరించారు. పట్టణంలోని ఎరువులు, విత్తనాలు షాపులు తనిఖీ చేసి స్టాక్ రిజిస్ట్రార్లను శుక్రవారం పరిశీలించారు. కంపెనీలు పేర్లు, బ్యాచ్ నబర్లు పరిశీలించారు. ప్రతి షాపు యజమానులు పీసీలు ఉంటేనే విక్రయించాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ విత్తనాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకి అమ్మాలని, నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బిల్లు తీసుకోకపోతే నకిలీ సరుకు అంటగట్టే ప్రమాదం ఉందన్నారు. అదే విధంగా షాపు యజమానులు రైతుకి బిల్లు ఇచ్చి వారి యొక్క సంతకం కూడా తీసుకోవాలని కోరారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసు నమోదు

చిలకలూరిపేట టౌన్: మద్యం మత్తులో పోలీస్ కానిస్టేబుల్‌పై వ్యక్తి దాడి చేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని సీఆర్ కాలనీ వైన్‌షాపు వద్ద గురువారం రాత్రి త్రిపుల్ రైడింగ్ చేస్తూ వస్తున్న వారు అటుగా వెళ్తున్న కానిస్టేబుల్‌ను చూసి భయపడుతూ తమ వాహనం అదుపు చేసే క్రమంలో కిందపడిపోయారు. దీంతో తాము కింద పడేందుకు కానిస్టేబుల్ కారణమంటూ నిందిస్తూ దుర్భాషలాడారు. అదివిన్న కానిస్టేబుల్ వారిని వారించే ప్రయత్నం చేయగా మద్యం తాగి ఉన్న వారు కానిస్టేబుల్‌పై తిరగబడి దాడి చేసి పరారయ్యారు. సదరు కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. యడ్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన కోడిరెక్క మహేష్(23) ఈ నెల 1న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఏఎంజీ ఎదురుగా ఉన్న డొంక రోడ్డులో నుంచి యడ్లపాడు వెళ్ళేందుకు మోటార్ సైకిల్‌పై హైవే దాటే క్రమంలో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. గాయాలపాలైన మహేష్‌ను మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి ముత్తయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వృక్ష సంరక్షణే లక్ష్యమై..

- రెండు కిలోమీటర్ల మేర వృక్షాల పెంపకం
- కొన్నేళ్ల కృషి ఫలితం
- నందనవనంగా గణపవరం- నాదెండ్ల రోడ్డు



గణపవరం-నాదెండ్ల రోడ్డులో గాలిబ్ నాటి సంరక్షించిన వృక్షాలు

నాదెండ్ల: ఒకప్పుడు అశోక చక్రవర్తి రహదారులకు ఇరువైపులా చెట్లు నాటించాడని ప్రతీతి. ప్రస్తుత రోజుల్లో ఇంటి ముందు కనీసం చిన్న మొక్క నాటేందుకు కూడా ప్రజలు ఆసక్తి చూపనంత బిజీ జీవితాలు గడుపుతున్నారు. పచ్చని చెట్లు కనుమరుగవుతున్న వేళ పర్యావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుని రుతువులు ప్రభావితమయ్యే దశ దాపురించింది. ఎండా కాలం వచ్చిందంటే సూర్యుని తాపానికి ఉక్కిరిబిక్కిరవటం, వానా కాలంలో సరైన వర్షపాతం నమోదుకాక ఆకాశం వంక బేలగా చూడటం పరిపాటిగా మారింది. అయితే అక్కడక్కడా కొందరు ప్రకృతి ప్రేమికులు తన వంతుగా పచ్చని మొక్కలు నాటి అవి పెరిగి వృక్షాలయ్యేలా పరిరక్షించటం చూస్తున్నాం. ఆకోవకి చెందిన వ్యక్తి గణపవరం గ్రామానికి చెందిన షేక్ పెద్దగాలిబ్. గణపవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో 1982లో సబార్డినేట్‌గా ఉద్యోగంలో చేరారు. అటు ఉద్యోగం చేస్తూనే గణపవరం పంచాయతీ కార్యాలయం నుంచి నాదెండ్ల రోడ్డులోని ఎన్ఎస్‌పీ కాలువ వరకూ రెండు కిలోమీటర్ల మేర రెండు వైపులా మొక్కలు నాటాడు. ప్రతి రోజూ రిక్షాపై నీటి రమ్మును ఏర్పాటు చేసుకుని మొక్కలకు నీరందించాడు. గాలిబ్ పరిరక్షణతో మొక్కలు ఏపుగా పెరిగి నేడు భారీ వృక్షాలయ్యాయి. ఈ రహదారి ఇరువైపులా పెద్ద పెద్ద చెట్లతో పచ్చగా కళకళలాడుతుంది. ఎంతటి ఎండాకాలమైనా చల్లటి నీడనిస్తున్నాయి. ఈ రహదారి గుండా ప్రయాణించే వారు ఈ చెట్ల నీడలో సేదతీరుతుంటారు. మే 29న పెద్ద గాలిబ్ తన 87వ ఏట కన్నుమూశారు. ఆయనకు ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమారుడు షేక్ ఆదంవలి ప్రస్తుతం గణపవరం ఐదో వార్డు కౌన్సిలర్‌గా వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొంది కొనసాగుతున్నారు. నేడు గాలిబ్ సంస్మరణ గ్రామంలో నిర్వహిస్తున్నారు.



షేక్ పెద్దగాలిబ్ (ఫైల్)

'మృత్యుంజయులు' నవలను తెలంగాణ రికార్డు చేయాలి

- రచయిత శివరామకృష్ణకు సముచిత గుర్తింపునివ్వాలి
- అరసం జిల్లా ఉపాధ్యక్షుడు గోలి సీతారామయ్య



బొల్లిముంత శివరామకృష్ణ చిత్రపటం వద్ద పుష్పాంజలి

తెనాలి: తెలంగాణ ఇతివృత్తంతో వచ్చిన తొలి నవల 'మృత్యుంజయులు' రాసిన బొల్లిముంత శివరామకృష్ణ అనేది ఆ రాష్ట్రప్రభుత్వం రికార్డు చేసి ఆ రచయితను గౌరవించాలని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ఉపాధ్యక్షుడు, బుద్ధభూమి సంపాదకుడు గోలి సీతారామయ్య అభిప్రాయపడ్డారు. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని కూడా సూచించారు. ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, అభ్యుదయ రచయిత, సినీ సంభాషణల రచయిత బొల్లిముంత శివరామకృష్ణ 20వ వర్ధంతిని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ కళా సమితి, ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో-ఆపరేషన్ అండ్ ఫ్రెండ్షిప్ (ఇస్కఫ్)), తెనాలి సంయుక్తంగా నిర్వహించిన సభకు కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. ప్రధాన వక్త సీతారామయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, తెలుగు సాహిత్య, చలనచిత్ర రంగాల్లోనూ తనదంటూ విశిష్ట స్థానం పొందిన శివరామకృష్ణ, పలు రంగాలను ప్రభావితం చేశారని చెప్పారు. త్రిపురనేని గోపీచంద్ ప్రభావంతో 15 ఏళ్ల వయసులోనే తొలి కథ రాసిన శివరామకృష్ణ తర్వాతి కాలంలో రాసిన కథలు ప్రశస్తమైనవిగా గుర్తుచేశారు. అరసం ప్రథమ మహా సభల స్ఫూర్తితో వాస్తవికతను ప్రతిబింబిస్తూ సమాజాన్ని చైతన్యం చేస్తూ ముందడుగు వేయించేలా రచనలు చేశారని చెప్పారు. ఖైదీ బాబాయ్, మనుషులు మారాలి, కాలం మారింది, శారద వంటి అనేక చిత్రాల్లో పదునైన సంభాషణలు రాశారని సోదాహరణంగా వివరించారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బీవీ రావు మాట్లాడుతూ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా ఆ పార్టీకి శివరామకృష్ణ సేవలు గొప్పవని చెప్పారు. లంక భూముల్లో పేదల కోసం చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా భూపోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారని చెప్పారు. కమ్యూనిస్టులపై నిర్బంధం అమలు చేసిన రోజుల్లో అజ్ఞాతంలో ఉంటూ నగారా పత్రికను నడిపారని చెప్పారు. బందరు పార్లమెంటుకు చల్లపల్లి రాజాపై పోటీ చేశారని తెలిపారు. బహుముఖ ప్రతిభ కలిగిన శివరామకృష్ణ జీవితాంతం ప్రజా చైతన్యం, సమాజ శ్రేయస్సు కోసమే పనిచేశారని వివరించారు. రచయిత/కవి రంగిశెట్టి రంగయ్య తన ప్రసంగంలో శివరామకృష్ణ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ ప్రజలను చైతన్య వంతం చేసే శక్తివంతమైన రచనలు చేశారని చెప్పారు. సభకు ముందు బొల్లిముంత శివరామకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బెజ్జంకి నాగమణి, వెనిగళ్ల ప్రసాద్, బెల్లంకొండ వెంకట్, నీలాంబ్రం, శ్రీదేవి, వసంతయామిని, దేవిశెట్టి కృష్ణారావు, తన్నీరు శివశంకర్, బొల్లిముంత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేదు

- ఆగస్టు 15 వరకు నిల్వలు
- మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి
- శాంతినగర్ రిజర్వాయర్ పరిశీలన



శాంతినగర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు

నరసరావుపేట: పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు మున్సిపల్ రిజర్వాయర్లలోని నీరు వచ్చే ఆగస్టు 15వ తేదీ వరకు ఇబ్బంది లేదని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ డీఈ ఓలేటి శ్రీనివాసరావు, ఏఈ నాయక్‌లతో కలసి శాంతినగర్ వాటర్ ప్లాంట్ శుక్రవారం పరిశీలించారు. పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు నీటి నిల్వలు ఎప్పటివరకు వస్తాయో అంచనా వేశారు. సాగర్ కాల్వలకు నీరు వదిలేందుకు సమయం ఉన్నందున అప్పటి వరకు ఉన్న నీటిని సరఫరా చేసేందుకు తగిన ప్రణాళిక రూపొందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం శాంతినగర్ వాటర్ ప్లాంట్‌లోని ఫిల్టర్ బెడ్ క్లీనింగ్ పరిశీలించి స్వచ్ఛమైన మంచినీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు అందించేందుకు తగిన సూచనలు ఇచ్చారు.

అధైర్యపడొద్దు... అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే శివకుమార్



పార్టీ నేతలతో శివకుమార్

తెనాలి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న విధ్వంసంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు అధైర్యపడొద్దని, అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయానికి శుక్రవారం సాయంత్రం తరలివచ్చిన పార్టీ నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం జరిగిన పరిణామాలను పార్టీ నేతలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రజల తీర్పును గౌరవించాల్సిందేనని చెప్పారు. అలాగని ఓటమితో కుంగిపోవాల్సిన పని లేదని ఆయన ధైర్యం చెప్పారు. ఇలాంటి పోరాటాలు తనకు కొత్త కాదని పేర్కొన్నారు. మంచి రోజులు వస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. పార్టీ నేతలు మద్దాళి శేషాచలం, తాడిబోయిన రమేష్, దేసు శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు గొడవర్తి హరేకృష్ణ, తాడిబోయిన రామయ్య, యాతాటి అనిల్, మొగల్ అహ్మద్, షేక్ దుబాయ్‌బాబు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని



నాగలక్ష్మిని అభినందిస్తున్న రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు, సూర్యనారాయణ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు చలమయ్య-కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల బీకాం ద్వితీయ సంవత్సర విద్యార్థిని టి.నాగలక్ష్మి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సంగడిగుంటలోని కళాశాలలో నిర్వహించిన వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ పంజాబ్‌లోని పటియాలాలో ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్న పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని చెప్పారు. గుంటూరు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరిలో గతనెల 29న జరిగిన 11వ ఏపీ స్టేట్ జూనియర్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భాగంగా 76 కేజీల విభాగంలో 365 కేజీల లోడ్‌తో తమ విద్యార్థిని బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు వివరించారు. కళాశాల కార్యదర్శి కర్నూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని నాగలక్ష్మితో పాటు కోచ్ ఎండీ కమ్రుద్దీన్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యుడు కర్నూరపు సూర్యనారాయణ, కోశాధికారి జయప్రకాష్, ఎన్ఎస్ఎస్ అధికారి ఏ శ్రీధర్, ప్లేస్‌మెంట్ అధికారి చంద్రశేఖర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ మధుసూదన్ పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు

తెనాలిఅర్బన్: స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్(స్టెప్) సంస్థ ఆధ్వర్యంలో తుళ్లూరు మండలం నెక్కల్లులో ఈ నెల 16, 17 తేదీల్లో ఉచిత పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ తెనాలి నియోజకవర్గ కన్వీనర్ తన్నీరు శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రమణరావు సావిత్రిమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద మంది ప్రతినిధులు దీనిలో పాల్గొని శిక్షణ పొందే అవకాశం ఉందన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 9848366711లో సంప్రదించాలని కోరారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం



తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ కృష్ణానది దిగువ ప్రాంతంలోని సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద నీటిలో వృద్ధురాలి మృతదేహాన్ని పోలీసులకు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాలు.. స్థానికులు సమాచారం మేరకు కృష్ణానది నీటిలో వున్న మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. ఆమెను గుర్తించేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదు. సుమారు 55- 60 సంవత్సరాలు ఉండవచ్చని, ఎత్తు 4.5 ఉందని, ఆమె వంటిపై నీలి రంగు జాకెట్, పాచిరంగు పసుపురంగు వంగపువ్వు రంగు వున్న చీర ధరించిందని, లో దుస్తులు వంకాయ రంగు కలిగి ఉందని, మెడలో తాళిబొట్టుతోపాటు నలుపురంగు దారం ఉందని ఎవరైనా ఈ వృద్ధురాలి వివరాలు తెలిస్తే 8688831365 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముదిరాజుల జనాభా తగ్గించి చూపటం సరికాదు

ఏబీకేఎంఎం జాతీయ యువత అధ్యక్షుడు మహేందర్ కేసరి



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది జనాభా గల ముదిరాజ్ సామాజికవర్గాన్ని ప్రభుత్వ రికార్డులలో కేవలం 3 లక్షలు మాత్రమే చూపటం సరికాదని అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ మహాసభ (ఏబీకేఎంఎం) జాతీయ యువత అధ్యక్షుడు మహేందర్ కేసరి అన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనస్వామ్యంలో తమ సామాజికవర్గానికి ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనే ఆర్థిక స్తోమత లేనందున ఎమ్మెల్సీ వంటి నామినేటెడ్ పదవులను కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందే తెనుగు (ముదిరాజ్) సామాజికవర్గం వలనేనని, అటువంటి రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం తగిన గుర్తింపు లేకపోవడం బాధాకరమని అన్నారు. ముదిరాజులకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొర్న వెంకట నారాయణ మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఎ జాబితాలోకి మార్చాలని అన్నారు. ముదిరాజ్ మహాసభ కృష్ణాజిల్లా అధ్యక్షుడు తుమ్మా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏ పార్టీ అయినా తమను జెండాలు మోయటానికే పరిమితం చేస్తున్నారని, పదవుల విషయానికి వచ్చేసరికి అన్యాయం చేస్తున్నారని వాపోయారు. కొత్త ప్రభుత్వమైనా ఈ విధానాన్ని మార్చుకోవాలని అన్నారు. సమావేశంలో ఏపీ ముదిరాజ్ మహాసభ కార్యదర్శి సాంబశివరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు క్రేన్ శివాజీ, పరసా శ్రీనివాసరావు, పిట్టల అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ కేసరిని సత్కరించారు.

800 లీటర్ల బెల్లంఊట ధ్వంసం



నిజాంపట్నం: నాటుసారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని అలాంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఆర్.యు.వి.ఎస్.ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని దిండి పంచాయతీ అదవలలో శుక్రవారం దాడులు నిర్వహించారు. సీఐ ప్రసాద్ మాట్లాడుతూ నాటుసారా జోలికి పోయి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. నాటుసారా వలన ఎన్నో అనర్థాలు ఉన్నాయని చెప్పారు. నాటుసారా తయారీ, అమ్మకాలు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా అదవల గ్రామ శివారు మడ అడవుల్లో నిర్వహించిన దాడుల్లో 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది చిలకా రాజు, గోపీకృష్ణ, శివప్రసాద్ పాల్గొన్నారు.

అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీల్లో గుంటూరు సత్తా



ఎస్కే రషీద్ (85)

మూలపాడు(ఇబ్రహీంపట్నం): అంతర్‌జిల్లాల వన్డే క్రికెట్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు సత్తా చాటింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూలపాడు ఏసీఏ గ్రౌండ్‌లో సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల వన్డే క్రికెట్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. గుంటూరు-ప్రకాశం జిల్లా, వెస్ట్ గోదావరి-కృష్ణా జిల్లాల జట్లు తలపడ్డాయి. గుంటూరు- ప్రకాశం మధ్య పోటీలో తొలుత ప్రకాశం జట్టు బ్యాటింగ్ చేసింది. వర్షం కారణంగా 16 ఓవర్లకు కుదించారు. ప్రకాశం జట్టు 16 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. అనంతరం గుంటూరు జిల్లా జట్టు 16 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసి విజయం సాధించింది. ఎస్కే రషీద్ 47బంతుల్లో 85 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. వెస్ట్ గోదావరి-కృష్ణా మ్యాచ్‌లో వెస్ట్ గోదావరిపై కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కృష్ణా జట్టు 19.4 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 117 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. ఏడు పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

విద్యార్థులకు నైపుణ్యాలపై శిక్షణ



విద్యార్థులతో సుబ్బరత్నమ్మ, ఇతర అతిథులు

గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి పరుస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌర గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తి, ఏకాగ్రత పెరుగుతాయని, తద్వారా చదువుపై శ్రద్ధ చూపుతారని అన్నారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తూర్పు తహసీల్దార్ పి.నగేష్, విశ్రాంత ఆర్టీఓ బాల గణేషయ్య, రెడ్డి కాలేజీ ప్రిన్సిపాల్ టీఆర్ రమేష్, పి.విజయగౌరి, జిల్లా గ్రంథాలయసంస్థ సీనియర్ అసిస్టెంట్ ఎం.సీతారామయ్య, సిబ్బంది కె. చిన్నపరెడ్డి, ఐవీ దుర్గారెడ్డి, తాటి విజయ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఇంటర్నల్ స్క్వాడ్ ఏడీఏ ధనరాజు



విత్తనాల పర్మిట్లను పరిశీలిస్తున్న ఇంటర్నల్ స్క్వాడ్ ఏడీఏ ధనరాజు

చీరాల రూరల్: విత్తన పర్మిట్లు పొందిన లైసెన్సు దుకాణదారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటర్నల్ స్క్వాడ్ అద్దంకి ఏడీఏ కే ధనరాజు హెచ్చరించారు. శుక్రవారం చీరాల మండలం, టౌన్‌లో ఉన్న పలు విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా విత్తనాలు విక్రయించే దుకాణదారులు విక్రయించే విత్తనాలకు సంబంధించిన లైసెన్సులు కచ్చితంగా తీసుకుని ఉండాలని అధికారులు దుకాణదారులకు సూచించారు. అలానే విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు విత్తనాలు కొన్నట్లు రసీదులు తప్పకుండా ఇవ్వాలని, లైసెన్సు పొందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. లైసెన్సు పొందని విత్తనాలు రైతులకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలానే బిల్లు బుక్కులు, స్టాక్ రిజిస్టర్లను కూడా ఎప్పటికప్పుడు రిజిస్టర్ చేయించుకోవాలని, సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా ఏడీఏ ద్వారా బిల్లు బిక్కులు, స్టాక్ రిజిస్టర్లు సర్టిఫై చేయించుకోవాలని సూచించారు. నిబంధలన్నింటిని దుకాణదారులు పాటించి రైతులకు తమ సహాయ సహకారాలు అందించి అధిక దిగుబడులు సాధించేందుకు సహకరించాలని సూచించారు. అలాకాకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరించి నకిలీ విత్తనాలు రైతులకు విక్రయించినట్లు తెలిసినా, రైతులు ఫిర్యాదులు చేసినా అట్టి దుకాణాల లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.